క్లుప్తంగా

ఘనంగా సంతానలక్ష్మి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో సంతానలక్ష్మి అమ్మవారు

ఉదయగిరి: పట్టణంలోని బీసీకాలనీ సమీపంలో ఉన్న శ్రీసంతానలక్ష్మి అమ్మవారి ఆలయంలో సోమవారం ఘనంగా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎల్‌వీ ప్రసాద్‌శర్మ గణపతిపూజ, పుణ్యాహవాచనం, కలశపూజ, నవగ్రహ మండపారాధన అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు.

ఏవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శంకర్‌రెడ్డి



వాసిపల్లి శంకర్‌రెడ్డి

దుత్తలూరు: ఆంధ్రా విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దుత్తలూరు మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన వాసిపల్లి శంకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఏకగ్రీవంగా తనను ఎంపిక చేసిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తానని, రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలను పోరాటాల ద్వారా పరిష్కరిస్తానని తెలిపారు.

అంకమ్మ, మల్లెంకొండయ్య దేవర్లకు పూజలు



విశేష అలంకరణలో అంకమ్మతల్లి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలో కొలువైన శ్రీఅంకమ్మ, మల్లెంకొండయ్య దేవర్ల కొలుపు ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహం వద్ద ముగ్గులు వేసి గ్రామంలో గిన్నెభిక్ష నిర్వహించారు. మధ్యాహ్నం రాజు, ప్రధాని సాంగెములు నిర్వహించి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అంకమ్మతల్లి హరికథను భక్తులకు వినిపించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంగం: మండలంలోని తలుపూరుపాడు, కొరిమెర్ల గ్రామాల్లో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తుండడంతో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

లక్షల వ్యయం.. లక్ష్యం శూన్యం



సీతారామపురం మండల కార్యాలయాల వద్ద ఆర్‌డీ యూనిట్



రంగనాయుడుపల్లి ఎస్సీకాలనీ వద్ద నిర్మించిన మదర్ ప్లాంట్

- తెరుచుకోని ఆర్‌డీ యూనిట్లు
- మినరల్ వాటర్ కోసం ప్రజల ఎదురుచూపులు

సీతారామపురం: ఫ్లోరిన్ ప్రభావిత ప్రాంతమైన సీతారామపురం మండలంలోని ప్రజలకు మినరల్ వాటర్ అందించాలనే లక్ష్యంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆర్‌డీ (రిమోట్ డిస్పెన్సింగ్) యూనిట్లు నేటికీ తెరచుకోక సంవత్సరాల తరబడి దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. మండలంలోని 14 పంచాయతీల్లో 15 ఆర్‌డీ యూనిట్లు ఏర్పాటు చేసినా లక్ష్యం నెరవేరలేదు. వాస్తవానికి 2019 నాటికే తాగునీరు అందించాల్సి ఉండగా అప్పటి ప్రభుత్వం ఆ లక్ష్యాన్ని నెరవేర్చలేకపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నీటిని కొని తాగలేక కుళాయిలు, చేతిపంపులపైనే ఆధారపడుతూ వాటి ద్వారా వచ్చే ఫ్లోరైడ్ నీటినే తాగుతున్నారు. ఫ్లోరైడ్ ప్రభావిత నీరు తాగి రోగాలబారిన పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.3 కోట్ల వ్యయంతో..

సీతారామపురం మండలంలోని రంగనాయుడుపల్లి ఎస్సీకాలనీ వద్ద సుజల పథకం కింద రూ.3 కోట్ల వ్యయంతో మదర్ ప్లాంట్‌ను నెలకొల్పి సంప్ సైతం ఏర్పాటు చేశారు. ఇక్కడ గంటకు పది వేల లీటర్ల సామర్థ్యంలో నీటిని శుద్ధిచేసి ట్యాంకర్ల ద్వారా గ్రామాల్లో ఏర్పాటు చేసిన 15 ఆర్‌డీ యూనిట్లకు నీరు సరఫరా చేసి మినరల్ వాటర్‌ను ప్రజలకు అందించాల్సి ఉంది. అయితే ఎట్టకేలకు 2023వ సంవత్సరం ఈ పనులు పూర్తయ్యాయి. అయితే ఈ పథకానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో వినియోగంలోకి రాని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. మండలంలోని అన్ని పంచాయతీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌డీ యూనిట్ల వద్ద ఏటీఎం లాంటి కార్డుల ద్వారా నీటిని పట్టుకునే ఏర్పాట్లు సైతం పూర్తయ్యాయి. కేవలం విద్యుత్ సౌకర్యం లేని కారణంగా కోట్ల రూపాయల విలువ చేసే పథకం నిరుపయోగంగా మారింది. ఇది కాస్త పూర్తయితే రూ.2లకే 20 లీటర్ల మినరల్ వాటర్ ప్రజలకు లభిస్తున్నందున ఆ దిశగా పాలకులు, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండలవాసులు కోరుతున్నారు.



ఏర్పాటు చేసిన సంప్

మినరల్ వాటర్ అందించాలి



సీతారామపురం మండలంలో ఫ్లోరిన్ ప్రభావిత నీరు తాగుతూ రోగాలబారిన పడుతున్నాం. రూ.2లకే 20 లీటర్ల మినరల్ వాటర్ అందించే పథకాన్ని త్వరితగతిన ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– బొబ్బా అంకయ్య, అయ్యవారిపల్లి

త్వరలోనే వినియోగంలోకి తెస్తాం



సుజల నీటి పథకం పనులన్నీ పూర్తయ్యాయి. విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించిన ప్రతిపాదనలు లేకపోవడంతో జాప్యం జరిగింది. నూతనంగా ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే సుజల పథకాన్ని వినియోగంలోకి తీసుకొస్తాం.

– జగన్నాథం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సీతారామపురం

వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోండి

వరికుంటపాడు: మండలంలో వయోజనులు వైద్య సిబ్బంది అందించే అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖరరాజు సూచించారు. ఆయన సోమవారం మండలంలోని రామాపురం సచివాలయ పరిధిలో టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి సూచనలందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షయ నివారణకు ఈ టీకాల కార్యక్రమం గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతి గురువారం జరుగుతుండేదని, ఇకపై ప్రతి సోమవారం కూడా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం ఆరోగ్య సిబ్బంది 143 మందికి టీకాలు వేసినట్లు తెలిపారు.



రికార్డులు పరిశీలిస్తున్న సీహెచ్‌ఓ రాజశేఖరరాజు

భక్తిశ్రద్ధలతో ఆత్మారామస్వామి ఉత్సవాలు



ఆత్మారామస్వామి ఉత్సవంలో కోలాటం ప్రదర్శిస్తున్న భక్తులు

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామంలో వెలసిన శ్రీసీతా లక్ష్మణ సమేత ఆత్మారామస్వామి ఆలయ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను శేష వాహనంపై కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. శ్రీవాసవి భజన బృందం ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శించారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని సోమశిల ప్రాజెక్టు సమీపంలో ఉన్న పరమానంద ఆశ్రమం వద్ద సోమవారం శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామితో కలిసి పలు కార్యక్రమాల్లో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన యాగశాల ప్రారంభం, వేద పాఠశాల నిర్మాణానికి భూమి పూజ, మాతృశ్రీ ఆలివేలు మంగతాయారమ్మ తదియారాధన మండప ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో చినజీయర్ స్వామితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.



చినజీయర్ స్వామితో మాట్లాడుతున్న మంత్రి

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పర్వదినం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని ఈద్గాలో నమాజ్ చదివేందుకు వచ్చిన ముస్లింలతో దర్గా, మసీదుకు చెందిన టష్ ఇమామ్ సయ్యద్ ఖ్రుృ జమా ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం బక్రీద్ పండగ విశిష్టతను వివరించారు. మహిమలూరు, బొటికర్లపాడు, బోయలచిరివెళ్ల, కరటంపాడు, నాగులపాడు, నల్లపరెడ్డిపల్లి, అప్పారావుపాళెం తదితర గ్రామాల్లో బక్రీద్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

సంగం: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం సంగం చెక్‌పోస్ట్ సెంటర్ వద్ద ఉన్న ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మర్రిపాడు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ముస్లింలు సోమవారం బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మర్రిపాడు, అల్లంపాడు, నందవరం, కదిరినేనిపల్లి, పల్లవోలు, చుంచులూరు, కృష్ణాపురం, నాగినేనిగుంట తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాలకు వెళ్లి నమాజు చేశారు.

సోమశిల(చేజర్ల): బక్రీద్ పర్వదినం సందర్భంగా సోమవారం చేజర్ల మండలం ఆదురుపల్లి ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మౌలానా మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సోమశిల: మండల కేంద్రం అనంతసాగరంలోని ఈద్గాలో సోమవారం బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అనుమసముద్రంపేట: మండల కేంద్రం ఏఎస్‌పేటతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని ఈద్గాల్లో ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. హసనాపురం, గుంపర్లపాడు, ఏఎస్‌పేట, అనుమసముద్రం, గుడిపాడు, రాజవోలు గ్రామాల్లోని దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉదయగిరి: బక్రీద్ పర్వదినాన్ని ఉదయగిరి నియోజకవర్గవ్యాప్తంగా ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయగిరి, వింజమూరు పట్టణాల్లోని ఈద్గా మైదానాల్లో పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయగిరి మండలం గండిపాళెం, వెంగళరావునగర్, దాసరపల్లి, బిజ్జంపల్లి, అయ్యవారిపల్లి, పుల్లాయపల్లిలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్ద మతపెద్దలు ఖురాన్ సందేశం వినిపించారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వరికుంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, పెద్దిరెడ్డిపల్లి, తోటలచెరువుపల్లి, బోయమడుగుల, వరికుంటపాడు, విరువూరు తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కలిగిరి: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ముస్లింలు కలిగిరిలోని సయ్యద్ మంజాన్‌షావలి దర్గా, పెద్దపాడులోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జలదంకి: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జలదంకి మండలంలోని జలదంకి, బీకే అగ్రహారం, గట్టుపల్లి, జమ్మలపాళెం, సోమవరప్పాడు, కృష్ణాపాడు, చోడవరం తదితర గ్రామాల్లో మసీదులను ప్రత్యేకంగా అలంకరించి సామూహిక నమాజులు చేశారు. ముస్లిం మత పెద్దలు బక్రీద్ విశిష్టతను వివరించారు.

దుత్తలూరు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించారు. దుత్తలూరు బీసీకాలనీ, నర్రవాడ, నందిపాడు, వెంకటంపేట, లక్ష్మీపురం, ఏరుకొల్లు తదితర గ్రామాల్లో ఈద్గాల వద్దకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు.

సీతారామపురం: మండలంలోని తురకపాళెం, సీతారామపురం, సింగారెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, రంగనాయుడుపల్లి, గంధంవారిపల్లి, బసినేనిపల్లి తదితర గ్రామాల్లో సోమవారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అల్లూరు: స్థానిక మసీద్ సెంటర్‌లోని జామియా మసీద్, బీసీకాలనీలోని మదీనా మసీద్‌లలో బక్రీద్ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఇమామ్ అజ్మల్, ప్రెసిడెంట్‌లు షేక్ సమద్, షేక్ ఆకూర్, ముతవలి షేక్ ఉస్మాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరురూరల్: ఆత్మకూరులోని ఈద్గాలో బక్రీద్ సందేశం వినిపిస్తున్న ఇమామ్ సయ్యద్ ఖ్రుృ జమా



సంగం: ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



ఉదయగిరిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వాశిలిలో రాజకీయ రగడ

ఆత్మకూరురూరల్: మండలంలోని వాశిలిలో రెండు పార్టీల మధ్య రాజకీయ రగడ తారస్థాయికి చేరుకుంది. మూడేళ్ల క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన చెలిక రమా హరిబాబు ఎస్సీ రిజర్వుడ్ కోటాలో వాశిలి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అయితే వాశిలిలో టీడీపీ మద్దతుదారులు పరిపాలన పరంగా ఇబ్బందులు పెడుతున్నారని స్వయంగా సర్పంచ్ రమా హరిబాబు అనేక సందర్భాల్లో వాపోయారు. చివరికి సచివాలయంలో తనకు కేటాయించిన కుర్చీలో కూర్చొనేందుకు కూడా వీలులేకుండా పలుమార్లు అవమానాలు పడాల్సి వచ్చిందని అధికారులు, విలేకరుల ఎదుట ఆమె గతంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత దళితులమైన తమపై మరింత ఒత్తిడి పెరిగిందని సర్పంచ్, ఆమె భర్త ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న పంచాయతీ కార్యాలయాన్ని రేషన్‌షాపు డీలరు ఆక్రమించుకొని వ్యాపారం చేసుకుంటుండడంతో ప్రైవేట్ భవనంలో సచివాలయం ఏర్పాటు చేసుకొని పంచాయతీ నిధులతో అద్దె చెల్లించి కార్యకలాపాలు కొనసాగిస్తున్నామని, అయితే రాజకీయ కారణాలతో గత వారం రోజులుగా అద్దె భవనంలో ఉన్న సచివాలయానికి తాళాలు వేయించారని వారు తెలిపారు. అలాగే గ్రామానికి తాగునీరు సరఫరా చేసే ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి నివాసాలకు వెళ్లాల్సిన తాగునీరు సక్రమంగా చేరకుండా గ్రామంలోని కొందరు వ్యక్తులు ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని పంచాయతీ నీటి సరఫరా పైపులైన్ నుంచి నేరుగా మినరల్ వాటర్ ప్లాంట్‌కి తాగునీరు వినియోగించుకొని వ్యాపారం చేసుకుంటున్నారన్నారు. తాగునీటి విద్యుత్ మోటారు వద్ద ఏర్పాటు చేసిన బాక్స్‌కి తాళాలు వేస్తే ఆ బాక్స్ తాళాలు పగలగొట్టి మరీ ఇష్టానుసారం తాగునీటి మోటారు వినియోగించుకుంటున్నారని, ఈ క్రమంలో అనేక ఇబ్బందులు పడుతూ పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు సర్పంచ్ పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆయా సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రేషన్‌షాపు నిర్వహిస్తున్న పంచాయతీ భవనం

సచివాలయం అద్దె చెల్లిస్తాం

ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్న వాశిలి సచివాలయ భవనం యజమానికి రూ.35 వేలు అద్దెబాకీ ఉన్న మాట వాస్తవమే. మంగళవారం సచివాలయ భవనానికి అద్దె చెల్లించి యథావిధిగా కార్యకలాపాలు ప్రారంభిస్తాం. గ్రామంలో ఇతర ప్రభుత్వ భవనాలు తదితర అంశాలపై త్వరలోనే తగు చర్యలు తీసుకుంటాం.

– బాలాజీ నాయక్, ఎంపీడీఓ, ఆత్మకూరు

క్రీడా స్ఫూర్తి ముఖ్యం



విజేతలతో ఎస్సై అజయ్‌కుమార్

మనుబోలు : ఆటల్లో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తి ముఖ్యమైనదని ఎస్సై అజయ్‌కుమార్ అన్నారు. మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌ను మనుబోలు మెయిన్ టీమ్, గ్రౌండ్ టీమ్‌లు సంయుక్తంగా గెలుచుకున్నాయి. ఈ రెండు జట్ల మధ్య సోమవారం సాయంత్రం జరగాల్సిన ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దవడంతో నిర్వాహకులు రెండు జట్లను విజేతలుగా ప్రకటించారు. దీంతో విజేతలకు టీడీపీ నేత సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎస్సై అజయ్‌కుమార్ ట్రోఫీలను అందజేశారు. విజేత, రన్నరప్‌లకు కలిపి రూ.25 వేల నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు దండు చంద్రశేఖర్‌రెడ్డి, చేరెడ్డి రామిరెడ్డి, కిరణ్, రమేష్‌రెడ్డి, జనసేన నేత ప్రసాద్, నిర్వాహకులు సాయి, దీపు తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం

మనుబోలు : మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. యారాశి సాయికృష్ణ, శ్రావణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

వెంకటేశ్వరుడి దర్శనభాగ్యం పూర్వజన్మసుకృతం

నెల్లూరు(బృందావనం): సప్తగిరులపై కొలువైన కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరుడి దర్శన భాగ్యం పూర్వజన్మసుకృతమని నెల్లూరులోని దత్తాత్రేయ మఠం నిర్వాహకులు మాతా అనంతానందగిరి తెలిపారు. తిరుమల శ్రీవారి ఉచిత దీవెన యాత్రను పురమందిరం వద్ద గల జ్యోతి వినాయకస్వామి ఆలయం నుంచి నెల్లూరు సత్యమార్గ్ ఫౌండేషన్ రవి ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఆమె మాట్లాడారు. శ్రీవారి భక్తుల కోసం దీవెన యాత్రను చేపట్టడాన్ని అభినందించారు. అనంతరం నిర్వాహకుడు రవి మాట్లాడారు. జిల్లాలోని పురిణి, అల్లూరు, తోటపల్లిగూడూరు, కందమూరు, వరిగొండ, గుండ్లపాళెం తదితర 18 గ్రామాల నుంచి 250 మంది భక్తులతో దీవెన యాత్రను ప్రారంభించామని వివరించారు. హైందవ ధర్మప్రచారం ద్వారా ఆర్థిక స్తోమత లేని నిరుపేద భక్తులను తిరుమలకు తీసుకెళ్లి శ్రీవారి దర్శనభాగ్యం కల్పించడం ద్వారా తమ జీవితం ధన్యమైందని చెప్పారు. తొలుత భక్తిగీతాలను ఆలపించారు.